క్లుప్తంగా

నేడు కలెక్టర్ రాక

సిరికొండ: మండల కేంద్రానికి ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా రానున్నట్లు రెవెన్యూ తహసీల్దార్ తుకారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భూ భారతి పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ప్రజలు, రైతుల పెద్ద అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జిల్లా వాసికి డాక్టరేట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన నరేందర్ డాక్టరేట్ పట్టా పొందారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో గల కలింగ యూనివర్సిటీలో విద్యా రంగంపై పరిశోధన జరిపారు. మాధ్యమిక పాఠశాల విద్యార్థుల స్థాయిపై ఆందోళన.. మానసిక ప్రభావం అనే అంశంపై రీసెర్చ్ చేశారు. నరేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని విద్యార్థి బీఎడ్ కళాశాలలో విద్యాబోధన చేస్తున్నారు. డాక్టరేట్ లభించడంపై బంధువులు, మిత్రులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

అవగాహన సదస్సు విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న భూ భారతి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రమేశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడారు. మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో నిర్వహించనున్న సదస్సుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా రానున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రవేశ పరీక్ష

నార్నూర్: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సీట్లు భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ కుమార్ శనివారం తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష సమయానికి అర గంట ముందే చేరుకోవాలని సూచించారు.

రథయాత్ర విజయవంతం చేయండి

తలమడుగు: తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపన కోసం విశారదన్ మహరాజ్ చేపట్టిన లక్ష కిలో మీటర్ల మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు అగ్గిమల్ల నవీన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అగ్గిమల్ల గంగన్న, మధుకర్, స్వామి, నవీన్, అరుణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి బహుమతులు


బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపోలో మార్చి నెలలో అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి శనివారం అభినందించారు. మెరుగ్గా విధులు నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. అనంతరం వారికి బహుమతులు అందించారు. ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉద్యోగులు సైతం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కండక్టర్లు జ్యోతి కుమారి, శ్రీరామ్, శంకరయ్య, చైత్ర, శ్రీ లలిత, డ్రైవర్ అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకనగర్‌లో శనివారం ఉదయం బైక్ చోరీకి గురైనట్లు ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఉదయం 9 గంటల ప్రాంతాంలో జమ్మికుంట విశ్వచరణ్ అనే వ్యక్తి ద్వారక నగర్‌లోని ఆర్యభట్ట స్కూల్ ఎదుట బైక్ పార్కింగ్ చేశారు. రెండు గంటల అనంతరం వచ్చి గమనించే సరికి వాహనం లేదు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ సమీపంలో శనివారం గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన సల్మాన్ చౌహన్ మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం వచ్చింది. బాలాజీ నగర్ వద్ద అనుమానంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా ఆయన వద్ద 40 గ్రాముల గంజాయి లభ్యమైంది. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

రైతన్నల ఆందోళన



సిరికొండ మండల కేంద్రంలో సిరికొండ సిరి సంపద సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం జొన్నపంటను కొనుగోలు చేస్తోంది. రైతులు తమ పండించిన పంటను అమ్ముకునేందుకు తీసుకువచ్చారు. కాని శనివారం ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు వర్షం పడుతుందని ఆందోళన చెంది, జొన్న కుప్పలపై పాలీథీన్ కవర్లు కప్పారు. – సిరికొండ

మార్కెట్ కాదు.. బీటీరోడ్డు

ఈచిత్రంలో కనిపిస్తున్న జొన్నపంట సంచులను చూస్తే మార్కెట్ యార్డు అనుకుంటే పొరపడినట్లే. తాంసి మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సొసైటీ ఆధ్వర్యంలో జొన్నపంట కొనుగోలు చేస్తున్నారు. రైతులు పెద్ద ఎత్తున విక్రయించేందుకు తీసుకురావడంతో రోడ్డుపై కుప్పలు పోశారు. అధికారులు సైతం కొనుగోలు చేసిన పంటను తూకం వేసి రోడ్డుపైనే ఉంచారు. – తాంసి



పిల్లర్లకే పరిమితం



పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన మండలాలతో పాటు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గాదిగూడ మండలంలోని ఖడ్కి గ్రామ పంచాయతీకి పంచాయతీ భవనం మంజూరు చేశారు. కాని అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగకపోవడంతో పిల్లర్లకే పరిమితం అయింది. పంచాయతీ కార్యక్రమాలను గ్రామపటేల్ ఇంటి నుంచే నిర్వహిస్తున్నారు. – నార్నూర్

కనీస వేతనం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఝాడే నాందేవ్

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మధ్యాహ్న భోజనం సంఘం రాష్ట్ర సభ్యుడు ఝాడే నాందేవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ వద్ద మధ్యాహ్న భోజనం కార్మికులతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస గౌరవ వేతనం రూ. 10 వేలు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వంట కార్మికులను తొలగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఝాడే తాయి, శివాబాయి, స్రవంతి, సులోచనబాయి, జైతుబాయి, గిర్జాబాయి, రాంబాయి, భీంబాయి పాల్గొన్నారు.

పొరపాట్లకు తావులేకుండా చూడాలి


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తాంసి: ఉపాధి పనుల్లో అక్రమాలకు, పొరపాట్లకు తావులేకుండా చూడాలని అడిషనల్ పీడీ కుటుంబరావు అన్నారు. శనివారం తాంసి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో గతేడాది కాలంగా రూ.2.90 కోట్లతో చేపట్టిన 257 పనులతో పాటు రూ.3.29 కోట్లతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణలపై ఎంపీడీవో ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక విచారణ చేపట్టారు. సీఆర్పీలు అధికారుల సమక్షంలో పనుల వివరాలు, కూలీల సంఖ్య అంశాలను చదివి వినిపించారు. జామిడి గ్రామంలో పనులకు వెళ్లిన వారికి కాకుండా వెళ్లని వారికి బిల్లుల చెల్లింపు జరిగినట్లు గుర్తించారు. పలుచోట్ల ఉన్నతాధికారుల సంతకాలు లేకుండా చెల్లింపులు చేసినట్లు గుర్తించగా.. రికవరీకి ఆదేశించారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణారావు, ఈవీఎస్ అధికారి రాజేశ్వర్, ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఏపీవో విజయ, పంచాయతీరాజ్ ఏఈ మహేందర్, టీఏలు రాజన్న, పుష్ప, అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా ఫిర్యాదుల వేదిక


ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీవో మోహన్

బజార్‌హత్నూర్: మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలోని 64 గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, డీసీవో మోహన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. మండలంలోని అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి దరఖాస్తులు, జీరో కరెంటు బిల్లులు, రైతుభరోసా, పట్టా పాసుపుస్తకాలు, ఉచిత గ్యాస్ పథకంకు పలువురు అర్హత ఉండి వర్తించకపోవడంతో అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించినట్లు డీసీవో మోహన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, డీటీ హరిలాల్, ఆర్‌ఐ నూర్ సింగ్, విద్యాసాగర్‌రెడ్డి, రామారావ్, తదితరులు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించాలి’

కైలాస్‌నగర్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల ఆత్మీయ సమితి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే గేట్ వేసినప్పుడు 20 నిమిషాల పాటు ప్రజలు ఎండలో ఉండాల్సి వస్తోందన్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కారణంగా ఎండకు ఇబ్బందులు పడకుండా ఉండేలా గేటుకు ఇరువైపులా గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. టీచర్స్‌కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా జరగడం లేదన్నారు. క్రాంతినగర్‌లో గత రెండు నెలల నుంచి డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని, వార్డు నెంబర్ 4లో నిర్మించిన సీసీరోడ్డుకు క్యూరింగ్ చేయడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ సలీం, చాందావార్ రాకేశ్, సుకుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు ఎలామాల గణేష్‌ను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మెరుగు చిరంజీవి పరామర్శించారు. సంఘ బాధ్యులతో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు నల్ల రాజేశ్వర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం మావలలోని రాజేశ్వర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ మంత్రి జోగు రామన్న, తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని దస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అనంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసులు మీ కోసం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. పోలీసులు ఎల్లప్పుడు మీ కోసం పని చేస్తార, గంజాయి విక్రయించడం, తరలించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదే విధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్‌కు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: బాల్య వివాహ ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈనెల 30న అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహ ముక్త్ భారత్‌పై శనివారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల బాల్ రక్షక్ భవనంలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో పురోహితులు, మౌలానా ఖాజీ, చర్చి పాస్టర్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, దశరథ్, డేవిడ్, సతీష్, స్వామి, కె.వినోద్, పురోహితులు, మౌలానా ఖాజీ, విలాస్ శర్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇచ్చోడ: మండలంలో ఇంటింటా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం మండలంలోని ముఖరా(బి) గ్రామంలో ఇందిరమ్మ సర్వేను ఎంపీడీవో లక్ష్మణ్ నిర్వహించారు. ప్రతి ఇంటింటికీ తిరిగి ఇందిరమ్మ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇంటికి అన్ని అర్హతలు ఉన్న వారిని గుర్తించి జాబితాలో పేర్లను నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

పహల్గాం మృతులకు సంతాపం


సంతాపం తెలుపుతున్న కవులు, రచయితలు

ఆదిలాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గం జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు ఐత్వారం ముచ్చట్లు రచయితల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల చౌక్‌లో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవి ఉదారి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు నిరసనగా ఉట్నూర్ పట్టణ కేంద్రంలో ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రితేశ రాథోడ్, కొండేరి రమేశ్, షబ్బీర్ అలీ, గణేశ్, శ్రీనివాస్, గట్క రమేశ రఘు, ప్రకాశ్ పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గతంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి సమీపంలో జరిగిన ఇరు వర్గాల దాడి కేసులో నలుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇరు వర్గాల దాడి కేసులో ఇరువర్గాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఓ వర్గంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా మరో వర్గంపై దాడి కేసు నమోదైందన్నారు. సైద్‌పూర్ గ్రామానికి చెందిన చరణ్‌దాస్, రాజు, రోహిదాస్, అంకుష్‌లను అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ: మహారాష్ట్రలోని నాగపూర్ రోజ్ కాలనీకు చెందిన మునవ్వర్‌ఖాన్ (56) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మునవ్వర్ ఖాన్ గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి సొంత ఐచర్ వాహనం ఉండగా.. నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు సరుకుతో వెళ్తున్న క్రమంలో మండలంలోని కుప్టి ఘాట్ ప్రాంతంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడగా గురువారం కొంత మంది కూలీలను మాట్లాడి వాహనంలో సరుకులు నింపుకున్నాడు. ఉదయం బహిర్భూమికి వెళ్తున్నానని తన క్లీనర్‌కు చెప్పి వెళ్లి పక్కనే ఉన్న గుట్ట వద్దకి వెళ్లి తాడును ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో ఫ్లోరైడ్ నివారణ

ఉట్నూర్‌రూరల్: ఫ్లోరైడ్ బారిన పడకుండా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని ఉమాపతికుంట గ్రామంలో పర్యటించారు. పీవో రాకతో గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలి కారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆర్వో ప్లాంట్ సక్రమంగా ఉపయోగించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం పీవోని గ్రా మస్తులు సన్మానించారు. హర్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్, ఆర్పీజీ పౌండేషన్ ప్రోగ్రాం అధికారి రవి కుమార్, జుగాదిరావ్ పాల్గొన్నారు.

‘విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు’


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో ప్రభాకర్

ఇంద్రవెల్లి: గ్రామ పంచాయతీ అధికారులు, కార్మికులు విధులపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులు, కార్మికులతో విధులు నిర్వహణ, సమయపాలన, పారిశుద్ధ్యం పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధులకు రాకుండా నిర్లక్ష్యంగా చేస్తే వెంటనే విధుల నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, సిబ్బంది శంకర్‌లాల్, నారాయణ, ఇద్రిష్ పాల్గొన్నారు.

సెల్ఫీ దిగుదాం.. వరంగల్ వెళ్దాం



సెల్ఫీ దిగుదాం.. వరంగల్ వెళ్దాం అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ 25 వసంతాల వేడుక సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభ సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం చలో వరంగల్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెల్ఫీ దిగి సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఇంటి పార్టీ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. – నేరడిగొండ

చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ ట్రస్ట్ పేరు మీద అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ట్రస్ట్ పేరు మీద తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ట్రస్ట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. అయ్యప్ప స్వామి భక్తులను తప్పుదోవ పట్టించి, తమ స్వార్థ ప్రయోజనాల కోసం నూతనంగా ట్రస్ట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన గోర్ల కిష్టన్న, తెడ్డోజి విజయ్ కుమార్, తాటిపెల్లి శివప్రసాద్, నిమ్మల రాంమోహన్ రెడ్డి, దెశ్పాండె అనిల్ కుమార్, ఝల్మల్వార్ రాజ్కుమార్, మంద జయనారాయణ రెడ్డి, చక్రవర్తుల పురుషోత్తమా చారి, శ్రీనివాస్ గౌడ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ అధ్యక్షుడు కుంభోజి సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్, ఉపాధ్యక్షుడు గౌర లక్ష్మణ్, కోశాధికారి టింగం నరేశ్ పాల్గొన్నారు.

పాఠకుల సమస్యలు పరిష్కరించాలి


అభ్యర్థులతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: పోటీ పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు గ్రంథాలయ పాఠకుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శనివారం పరిశీలించిన ఆమె నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ టైమింగ్స్ పొడగించాలని, అదే విధంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని పాఠకులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

మూగజీవుల సంరక్షణపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారులు

ఆదిలాబాద్: పశువైద్యులు మూగజీవుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశు వైద్యాధికారి కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వెటర్నరీ పాలీ క్లినిక్‌లో శనివారం నిర్వహించిన వరల్డ్ వెటర్నరీ డేను ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ వెటర్నరీ డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ రామారావు, గోపి కిషన్, సురేశ్, రజనీకాంత్, భాస్కర్ గుండావర్, కస్తాల సుధాకర్, గణపతి రావు, దేవిదాస్ దేశ్పాండే, ప్రేమదాస్, రామారావు రాథోడ్, సురేశ్ పాల్గొన్నారు.

‘మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్’

ఆదిలాబాద్‌టౌన్: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. పార్టీ రజతోత్సవ సభను కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జోగు ప్రేమేందర్, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సై పోస్టు భర్తీ చేయండి

నార్నూర్: జిల్లాలోనే మారుమూల మండలమైన నార్నూర్ పీఎస్‌లో గత ఏడాది నుంచి ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇబ్బంది అవుతుందని వెంటనే ఎస్సై పోస్ట్ భర్తీ చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నార్నూర్, గాదిగూడ మండలాల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ మండలమైన నార్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడాది నుంచి ఎస్‌ఐ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. ఆయన వెంట ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, తదితరులు పాల్గొన్నారు.